చదువులమ్మ ఒడి

- విద్యా కుసుమాలకు జగనన్న కానుక
- పేదరికం అడ్డు రాకుండా సాయం
- తల్లుల ఖాతాల్లో నేరుగా నిధుల జమ
- కాకినాడలో 25,710.. రూరల్‌లో 21,279 మందికి లబ్ధి



తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో పాల్గొన్న తల్లిదండ్రులు (ఫైల్)

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పిల్లల చదువుకు పేదరికం అడ్డం కాకుండా సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల్లోంచి పుట్టిన జగనన్న అమ్మ ఒడిని రాష్ట్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా అమలు చేస్తోంది. 2019–20 విద్యా సంవత్సరం నుంచి మూడు ఏళ్ల పాటు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం నాలుగో ఏట కూడా గత నెల 29న జమ చేశారు. ఈ పథకాన్ని అర్హులైన విద్యార్థులందరికీ అందించేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో అర్హులైన వారి పేర్లతో కూడిన జాబితాలు సచివాలయాల వద్ద నోటీస్ బోర్డులో ప్రదర్శించి వారి ఖాతాల్లో నగదు జమ చేశారు.

ప్రతి విద్యార్థి చదువుకోవాలనే..

ఏ ఒక్క పేద విద్యార్థీ ఆర్థిక భారంతో చదువుకు దూరం కాకూడదనేది సీఎం జగన్ తరచుగా చెప్పే మాట. గతంలో అనేక మంది పేదలు ఆర్థిక ఇబ్బందుల వల్ల తమ చిన్నారులను బడికి పంపేవారు కాదు. బడికి పంపిస్తే ఫీజులు, పుస్తకాలు, నోట్సులు, స్కూల్ బ్యాగ్ తదితర అవసరాలకు అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు జగనన్న విద్యా కానుక పేరుతో స్కూల్ బ్యాగ్‌తో సహా అన్ని వస్తువులను ప్రభుత్వమే అందజేస్తోంది. ఈ ఏడాది కూడా పాఠశాలల పునఃప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు. ప్రజా సంకల్ప యాత్రలో నిరుపేదల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసిన సీఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి విద్యార్థి పేదరికంతో చదువుకు దూరం కాకూడాదన్న సత్సంకల్పంతో అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశ పెట్టారు. ఈ పథకం ద్వారా పాఠశాలకు చిన్నారులను పంపించే అర్హులైన ప్రతి కుటుంబానికీ రూ.13 వేలను ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేశారు. మిగిలిన రెండు వేలలో రూ.వెయ్యి డిస్ట్రిక్ట్ టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్ (డీటీఎంఎఫ్), మిగిలిన రూ.వెయ్యి డిస్ట్రిక్ట్ స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ (డీఎస్ఎంఎఫ్)కు జమ చేస్తారు. జిల్లా కలెక్టర్ నియంత్రణలో ఈ నిధులు నిర్వహించబడతాయి. పాఠశాల స్థాయిలో అమ్మ ఒడి పథకాన్ని అమలు చేయనున్న నేపథ్యంలో గత నెల 26, 27 తేదీల్లో పేరెంట్ టీచర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. సమావేశంలో అమ్మ ఒడిలో భాగస్వాములైన తల్లులందరినీ పిలచి ఈ నెల 20న జరిగిన జగనన్న ఆణిముత్యాలు వీడియోను తల్లులకు ప్రదర్శించారు.

మండలం	లబ్ధిదారులు	నిధులు
కాకినాడ	25,710	37,75,50,000
కాకినాడ రూరల్	14,309	21,46,35,000
కరప	6,970	10,45,50,000

నాలుగేళ్లుగా అందుకుంటున్నా



అమ్మఒడి పథకం వరుసగా నాలుగో ఏడాది రావడం చాలా సంతోషంగా ఉంది. గతంలో ఎన్నడు లేని విధంగా పుస్తకాలు, బ్యాగు, బట్టలు, బూట్లు వంటివి ఇవ్వడంతో పాటు ఆర్థిక భరోసాగా డబ్బులు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది.

– భానుశ్రీ, 9వ తరగతి, శ్రీనగర్ ప్రభుత్వ పాఠశాల

సదుపాయాలు బాగున్నాయి



ప్రైవేట్ స్కూల్ తరహాలో పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయి. విద్యకు కావలసిన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు. చదువుకు పైసా ఖర్చు లేకుండా జగనన్న అన్ని వసతులు కల్పించడమే కాకుండా అమ్మఒడి అందజేస్తున్నారు.

– లావణ్య అక్షయ, 9వ తరగతి, శ్రీనగర్ పాఠశాల

వైద్య శిబిరంలో విద్యార్థులకు పరీక్షలు

కరప: మండలం గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కాకినాడ స్టార్స్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, పరీక్షలు నిర్వహించారు. మధుమేహం, దంత సంరక్షణ, కేన్సర్‌వ్యాధిపై అవగాహన కల్పించారు. కంటిపరీక్షలు నిర్వహించారు. ఫీడ్ ది హంగర్ ప్రోగ్రాంలో ముగ్గురికి ఒక్కొక్కరికి 26 కిలోల బియ్యం వంతున లయన్స్‌క్లబ్ ప్రతినిధులు అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం 300 అడుగుల పొడవున్న జాతీయ జెండాతో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి క్లబ్ ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. లయన్స్‌క్లబ్ కాకినాడస్టార్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వేలూరి సూర్యనారాయణ, ప్రెసిడెంట్ జి.నమశ్శివాయ, కార్యదర్శి ఐ.ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతున్న వ్యక్తి శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన కథనం మేరకు గొడ్డటిపాలేనికి చెందిన యేశెట్టి ఏసుబాబు (42) శరీరక సమస్యతో బాధపడుతూ ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇటీవల ఏసుబాబు కుక్కకాటుకు గురయ్యాడు. అప్పటినుంచి భార్యపై చిరాకు పడుతూ ఉండేవాడు. గురువారం మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఏసుబాబును చికిత్స కోసం బంధువులు 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమార్తె దుర్గా భవాని శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

సమగ్ర రీసర్వే సకాలంలో పూర్తిచేయాలి



మక్కురాయి ఏర్పాటును పరిశీలిస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ

కరప: జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన సమగ్ర రీసర్వేను సకాలంలో పూర్తిచేయాలని ఆర్డీఓ ఎస్‌వీ సత్యనారాయణ అన్నారు. మండల పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన కరపలో జరుగుతున్న మక్కురాళ్ల పాతిపెడుతున్న పనులను పరిశీలించి, సర్వేయర్లకు పలు సూచనలు చేశారు. సర్వేలో విస్తీర్ణంలో వ్యత్యాసాలుంటే రైతుల రికార్డులు కూడా పరిశీలించి పరిష్కరించాలన్నారు. వివాదాలకు తావివ్వకుండా రైతుల సమక్షంలో మక్కురాళ్లు పాతాలన్నారు. కాకినాడ డివిజన్ పరిధిలో 121 గ్రామాల్లో రీసర్వే పూర్తికాగా, ఆయా గ్రామాల్లో మక్కురాళ్లు పాతుతున్నట్టు తెలిపారు. కరప మండలంలో 19 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని ఆయన తెలిపారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఆర్‌ఐ పేపకాయల మాచరావు, వీఆర్వో రామకృష్ణ పాల్గొన్నారు.

బ్యాలట్ బాక్సుల పరిశీలన



కరప ఎంపీడీఓ కార్యాలయంలోని బ్యాలట్ బాక్సులు పరిశీలిస్తున్న అధికారులు

కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భద్రపరచిన బ్యాలట్ బాక్సులను శుక్రవారం జిల్లా పరిషత్, మండల అధికారులు పరిశీలించారు. ఎంపీడీఓ ఎ.అప్పారావు, జెడ్పీ ఉద్యోగులు మహ్మద్ తాఖీ, యుఎస్ రవికిరణ్, ఉపాధిపథకం ఏపీఓ ఈ.వెంకటరమణ వీటిని పరిశీలించారు. ఈనెల 19న గ్రామ పంచాయతీలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నందున అవసరమైన గ్రామాలకు బాక్సులు పంపనున్నట్టు ఎంపీడీఓ తెలిపారు. మండల పరిధిలో నడకుదురు, గొడ్డటిపాలెం గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున వార్డు సభ్యులకు ఉప ఎన్నిక జరగనుందన్నారు.

రంగా వర్సిటీ బోర్డు సభ్యుడిగా చింతా



ఈశ్వరరావు

కరప: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ బోర్డు సభ్యుడిగా కరప మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పెద కొత్తూరు గ్రామానికి చెందిన చింతా ఈశ్వరరావు నియమితులయ్యారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వర్సిటీ బోర్డుకు 15 మందిని సభ్యులను నియమిస్తూ వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులు జారీచేశారని, సీఎస్ పీఏ శుక్రవారం తనకు ఫోన్ చేసి బోర్డు సభ్యునిగా నియమించినట్టు ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి వర్సిటీ సభ్యుడిగా తన వంతు కృషిచేస్తానని ఈశ్వరరావు తెలిపారు

నేడు సంగీత విభావరి

కాకినాడ కల్చరల్: స్థానిక రామారావుపేటలో నూతనంగా నిర్మించిన భాస్కర కళావేదిక భవనంలో దేవరకొండ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఎంఎస్ సుబ్బలక్ష్మి సంగీత విభావరి శనివారం సాయంత్రం నిర్వహించనున్నట్టు నిర్వాకులు తెలిపారు. స్థానిక గాయకులు విభావరిలో పాల్గొని గీతాలు ఆలపిస్తారు.

కామర్స్ విద్యార్థులకు ఉజ్వల భవిత

కాకినాడ సిటీ: కాకినాడ ఏఎస్‌డీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం కామర్స్ విద్యార్థులు డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సామన–2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు బిజినెస్, మార్కెటింగ్ నిర్వహణపై స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రచారం చేశారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి పాల్గొని విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. గ్రీన్ లీఫ్ పాల్యూషన్స్ ఫౌండర్ ఎన్.శ్రీదేవి, సీఏ వి.రాధా, కళాశాల ప్రిన్సిపల్ అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం కార్యదర్శిగా సత్యనారాయణ



బాలాజీచెరువు: గ్రంథాలయ సంస్థ పింఛనుదారుల సంఘ ప్రధాన కార్యదర్శిగా కాకినాడకు చెందిన సలాది సాయి సత్యనారాయణ ఎన్నికై యారు. విశాఖపట్నంలో రాష్ట్ర గ్రంథాలయ పెన్షనర్ల సంఘం ద్వితీయ రాష్ట్ర మహాసభ కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రజలకు బాసటగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కన్నబాబు
- గొర్రిపూడిలో గడప గడపకూ



గొర్రిపూడిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ప్రజాభ్యుదయమే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న నవరత్న, ఇతర సంక్షేమ పథకాలు పేద, బడుగు, బలహీన వర్గాలకు బాసటగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలం గొర్రిపూడిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, ఏయే పథకాల ద్వారా ఎంత ప్రయోజనం పొందారో వివరించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చీకాల అప్పలరాజు, పార్టీ నాయకులు కానూరి శ్రీహరి, పుణ్యమంతుల తాతాజీ, డిబా కిశోర్, ఎర్రంనీడి సుబ్రహ్మణ్యం, శ్రీపాదం మహేశ్వరరావు, పాలాని సూరిబాబు, శ్రీపాదం విజయ్‌కుమార్ తదితరులు ఎమ్మెల్యేతో కలసి పాల్గొన్నారు. చంద్రబాబులా మోసం చేసే మనిషి సీఎం జగన్ కాదని, చెప్పారంటే చేస్తారంతే అన్నారు. ఎంపీడీఓ కె.అప్పారావు, ఈఓ పీఆర్డీ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కుట్టు మెషీన్ల పంపిణీ

బోట్‌క్లబ్: బీజేపీ దక్షిణ మండల అధ్యక్షుడు చెక్కా రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గట్టి సత్యనారాయణ, బీజేపీ నాయకులు పైడా భవన ప్రసాద్, సాలగ్రామ లక్ష్మీప్రసన్న, పైడా వెంకట నారాయణ, గూటూరు పద్మ పాల్గొన్నారు.

కుదిరాం బోస్‌కి నివాళులు

కాకినాడ రూరల్: స్వాతంత్ర్య యోధుడు కుదిరాం బోస్‌కు బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం శుక్రవారం నివాళులర్పించింది. బోస్ జయంతిని పురస్కరించుకుని సర్పవరం జంక్షన్‌లో ఆయన చిత్రపటానికి వాకర్స్ సంఘ నాయకులు అడబాల రత్నప్రసాద్, శిరిష, మహేష్, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి శ్రీగేష్ తదితరులు నివాళులర్పించారు.

జాతీయ జెండాల పంపిణీ

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఆర్మీ విశ్రాంత ఉద్యోగి శ్రీనగేష్ హర్ ఘర్ తిరంగాలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలన్నారు. ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్, డాక్టరు అడ్డాల సత్యనారాయణ, డాక్టరు శిరీష, సత్యనారాయణ పాల్గొన్నారు.

జనసేన నాయకుల పర్యటన

కరప: మండలం అరట్లకట్టలో శుక్రవారం జనసేన పార్టీ నాయకులు పర్యటించారు. పీఏసీ సభ్యుడు, కాకినాడ రూరల్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి పంతం నానాజీ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కల్సి పర్యటించారు.

ఘనంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్



కరపలో సేకరించిన మట్టికలశంతో ర్యాలీ చేస్తున్న నాయకులు, అధికారులు

కరప: మండల పరిధి గ్రామాల్లో శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ నిర్వహించారు. కరప సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఏపీఓ ఈ.వెంకటరమణ, కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, వలంటీర్లు, సచివాలయం, ఉపాధి సిబ్బందితో కలసి గ్రామంలోని మట్టిని కలశంలోకి సేకరించి, ర్యాలీ నిర్వహించి నా భూమి–నా దేశం, నేల తల్లికి నమస్కారం–వీరులకు వందనం అంటూ నినాదాలుచేస్తూ ప్రజలను చైతన్య పరచారు. అనంతరం నాభూమి–నాదేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మొక్కను నాటి, పూజలుచేసి, ప్రతిజ్ఞ చేయించారు. పెదకొత్తూరు, పెనుగుదురు, వాకాడ, జెడ్. భావారం గ్రామాల్లో సర్పంచ్‌లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రూరల్ మండలంలో..

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురంలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, ఎంపీటీసీ ముద్దన వెంకట్రాజు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ జేఈ గణేష్ తదితరులు నా మట్టి–నా దేశం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, నాయకుడు పుల్ల చందు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణమూర్తి, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు తదితరులు పాల్గొని మట్టికి నమస్కారం చేశారు.

మత్స్యకార వర్గాలకు సీఎం పెద్దపీట

- ఎమ్మెల్సీగా పద్మశ్రీ ఎంపిక ఇందుకు నిదర్శనం
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



ఎమ్మెల్సీ పద్మశ్రీకి స్వీటు తినిపిస్తున్న భర్త నారాయణరావు. పక్కన ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: మత్స్యకార సామాజికవర్గం రాజకీయంగా ఉన్నతస్థాయిల్లో ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆకాంక్షని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేకరరెడ్డి పేర్కొన్నారు. వాడబలిజ వర్గానికి చెందిన కర్రి పద్మశ్రీని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ మత్స్యకారుల్లో మరో ప్రధానమైన అగ్నికుల క్షత్రియులకు సంబంధించి కార్పొరేషన్ చైర్మన్‌గా బందన హరిని కూడా ఇక్కడి నుంచే నియమించారన్నారు. మత్స్యకారులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలనే ఆకాంక్షతోనే సీఎం ఇటువంటి నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే అన్నారు.

చారిటీస్ ఆస్తుల పరిరక్షణే లక్ష్యం

ఎంఎస్ఎన్ చారిటీస్ ఆస్తుల పరిరక్షణకు ఎల్లప్పుడు మద్దతుగా ఉంటానని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. దేవదాయశాఖ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి తనకు గాని, కమిటీ దృష్టిలోగాని లేకుండా ఇటీవల భూముల లీజు వేలం వేసేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. విషయం తెలిసిన వెంటనే ఆ వేలాన్ని రద్దు చేయించి బాధ్యులైన ఈఓకు మెమో ఇవ్వాల్సిందిగా కోరానన్నారు. కోట్లాది రూపాయల విలువైన భూములను దానంగా ఇచ్చిన నాయకర్ జయంతి, వర్ధంతులను అధికారంగా నిర్వహించాలని తీర్మానించానన్నారు. రూ.50 లక్షల ఎమ్మెల్యే నిధులను చారిటీస్ అభివృద్ధికి కేటాయించానన్నారు. కొండబాబులా తప్పుడు రికార్డులు సృష్టించి భూములను ఆక్రమించే నైజం తనది కాదని చారిటీస్ ప్రగతిపథంలో పయనించాలని కోరుకునేవాడినని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి స్పష్టం చేశారు.

చిరు రీ ఎంట్రీ ఉండదు

మెగాస్టార్ చిరంజీవి రాజకీయాల్లోకి మళ్లీ వచ్చే అవకాశం లేదని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. రాజకీయాల్లో ఇమడలేనన్న భావనతోనే ఆయన తప్పుకుని సినిమాల్లో కొనసాగుతున్నారని విలేకరుల ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న, ఏఎంసీ చైర్ పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయకుమార్, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి పాటుపడతా : ఎమ్మెల్సీ పద్మశ్రీ

కాకినాడ: మత్స్యకారుల జీవన విధానాన్ని మెరుగుపరచడంతో పాటు అన్ని రంగాల్లో ముందడుగు వేసేలా కృషిచేస్తానని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నివాసం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి పార్టీ కేడర్‌కు పంచారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వాడబలిజ మత్స్యకార వర్గానికి చెందిన మహిళకు తొలిసారిగా శాసనమండలిలో ప్రాతినిధ్యం దక్కడం చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా భావిస్తున్నానన్నారు. తనను ఎమ్మెల్సీ పదవికి ఎంపిక చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎంపీ వంగా గీత, ఇతర ఎమ్మెల్యేలకు పద్మశ్రీ కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, నారాయణరావు దంపతులను పార్టీ కేడర్ ఘనంగా సత్కరించారు.

అందరూ సంతోషంగా ఉండాలి



విశ్వకర్మ మహాయజ్ఞంలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి దంపతులు

కాకినాడ కల్చరల్: అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆనందభారతి గ్రౌండ్‌లో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ పరిషత్, శ్రీవిరాట్ విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవిరాట్ విశ్వకర్మ మహాయజ్ఞం పూజలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, మహాలక్ష్మి దంపతులు శుక్రవారం పాల్గొన్నారు. సంఘం అధ్యక్షుడు అరటికట్ల రాంబాబు ఆధ్వర్యంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దివ్యకల్యాణం నిర్వహించారు.

అవయవ దానంపై ప్రచారం చేయాలి

కరప: అవయవ దానంపై విస్తృతంగా ప్రచారం చేయాలని కాకినాడ అవయవదాన సంస్థ అధ్యక్షుడు, లయన్స్‌క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ బాదం బాలకృష్ణ అన్నారు. ఈనెల 13న జరిపే ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం జనరక్ష స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎవరైనా మరణించిన తర్వాత అవయవాలను దానంచేసేలా ప్రజలను చైతన్యపరచాలన్నారు. ఈసందర్భంగా కాలేజీవిద్యార్థులు అవయవదానం చేయడానికి ముందుకు వచ్చి, అంగీకారపత్రాలు అందజేశారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ అప్పలరాజు, స్వచ్ఛందసంస్థ అధ్యక్షుడు చెక్కా వినయ్‌కుమార్, ట్రస్ట్ ఆఫ్ బోండా అధ్యక్షుడు డాక్టర్ బొండా వెంకన్నారావు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అలసత్వం వద్దు

- సిబ్బందిపై కమిషనర్ మండిపాటు
- ఇద్దరిపై సస్పెన్షన్ వేటు




పారిశుధ్య పనులపై స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది అలసత్వంపై నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైన ఇద్దరిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చారు. శుక్రవారం కాకినాడ 12వ సర్కిల్ పరిధిలోని 38వ డివిజన్ నాగేశ్వరరావు వీధి, పాముపారి వీధి ప్రాంతాల్లో పనులను ఆయన తనిఖీ చేశారు. కొన్నిచోట్ల చెత్త పేరుకుపోవడాన్ని గుర్తించి సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గడపగడపకు ప్రభుత్వంలో పారిశుధ్యంపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో సచివాలయ కార్యదర్శి కిషోర్, శానిటరీ మేస్త్రి శ్రీనివాస్‌లను సస్పెండ్ చేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతెప్ప నాయుడు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే

ఓటర్ల సర్వే పారదర్శకంగా పూర్తి చేయాలని కమిషనర్ నాగనరసింహారావు ఆదేశించారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం బీఎల్‌ఓలతో ఓటర్ల సర్వేపై సమావేశం ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 20వ తేదీ లోపు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. బీఎల్‌ఓ సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, తహసీల్దార్ సీతాపతిరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

కమిషనర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగ నరసింహారావు

కాకినాడ: నగరపాలక సంస్థ కమిషనర్‌గా సీహెచ్ నాగనరసింహారావు శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా పనిచేసిన డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల బదిలీ కావడంతో నాగ నరసింహారావుకు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. పుర పరిపాలన శాఖ ఆదేశాల నేపథ్యంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్‌ను వివిధ విభాగాధిపతులు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలియజేశారు.

21 నుంచి ఎన్‌జీఓ రాష్ట్ర మహాసభలు



ఎన్‌జీఓ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్‌జీఓ సంఘ నాయకులు

కాకినాడ సిటీ: ఈనెల 21, 22 తేదీల్లో జరగనున్న ఎన్‌జీవో రాష్ట్ర మహాసభల జయప్రదం చేయాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మహాసభల వాల్‌పోస్టర్‌ను జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.అనంతలక్ష్మి సంఘం నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సమావేశానికి సీఎం జగన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని టౌన్ ఎన్‌జీవో యూనియన్ సంయుక్త కార్యదర్శి ఎం.శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది శైలజాకుమారి, లలిత, ఆంజనేయులు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో ప్రజలు బెంబేలు పంటలు బీళ్లు



కరపలో సాయంత్రం 4 గంటలకు ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న మెయిన్‌రోడ్డు



కరపలో ఎండలకు ఆరిపోతున్న దమ్ముచేసిన పొలం

కరప: వర్షాకాలమైనా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. శరీరం చెమటలతో జిగురుగా మారి, దురదలు వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బయటకు రావాలంటే బంబేలెత్తిపోతున్నారు. కీళ్ల నొప్పులు, జ్వరాలతో నీరసం వస్తోందని, ఎంతకూ తగ్గడంలేదని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు సాగునీరు సక్రమంగా రాక, ఎగువ ప్రాంతాల రైతులు మోటార్లతో నీరు తోడేస్తుండడంతో దిగువ ప్రాంతాల్లో ఉన్న కరప, విజయరాయుడుపాలెం, యండమూరులో పంట భూములు బీటలువారుతున్నాయని రైతులు వాపోతున్నారు. వాతావరణం చల్లబడి వర్షాలు పడకపోతే తొలకరిపంటపై ఆశ వదులుకోవాల్సిందేనని రైతులు అంటున్నారు.